క్లుప్తంగా

అంబేడ్కర్ విగ్రహంపై దాడి హేయం


తిర్రే బాబూరావు

నరసాపురం: విజయవాడలో దేశానికే తలమానికంగా గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడానికి కుల అహంకారులు ప్రయత్నించడం హేయమైన చర్యని నరసాపురం షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రిటైర్డ్ మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ తిర్రే బాబూరావు ఖండించారు. అర్ధరాత్రి టీడీపీ నాయకులు అంబేడ్కర్ స్మృతివనం వద్దకు వెళ్లినట్టుగా వార్తలొస్తున్నాయన్నారు. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగించే అంశమన్నారు. అంబేడ్కర్ మహనీయుడు ఓ కులానికో, మతానికో చెందిన వ్యక్తి కాదన్నారు. ఈ విషయాన్ని కుల అహంకారులు గుర్తించాలని పేర్కొన్నారు. ఈ ఘటనలో దోషులను వెంటనే అరెస్ట్ చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ భారీ విగ్రహాన్ని పెట్టాలన్న ఆలోచన గతంలో చంద్రబాబు ఎన్నడూ చేయలేదన్నారు. అంబేడ్కర్‌ను అవమానించాలని చూస్తే సహించేది లేదని, పోరాలు తప్పవని హెచ్చరించారు.

నరసాపురం రూరల్ సీఐగా దుర్గా ప్రసాద్


సీఐ దుర్గా ప్రసాద్

నరసాపురం రూరల్: నరసాపురం రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా జి.దుర్గా ప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. ఈయన 2002లో ఎస్సైగా ఎంపికై 2013లో సిఐగా పదోన్నతి పొందారు. గతంలో కుక్కునూరు, విజయవాడ సీఐడీ, విజయవాడ ట్రాఫిక్ తదితర ప్రదేశాల్లో పనిచేశారు. విజయవాడనుంచి నరసాపురం రూరల్ సీఐగా బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకూ ఇక్కడ పని చేసిన సీఐ గోవిందరాజు వీఆర్‌కు వెళ్లారు. బాధ్యతలు చేపట్టిన సీఐను పలువురు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పెనుగొండ ఎస్సైగా గంగాధర్



పెనుగొండ: పెనుగొండ ఎస్సైగా కె.గంగాధర్‌రావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వాసవీ శాంతిధామ్‌లో వాసవీ మాతను దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలో శాంతి భద్రతలు కాపాడడానికి ప్రతీ ఒక్కరూ సహకరించాలన్నారు. ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలను ఉపేక్షించేది లేదన్నారు. అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మొగల్తూరు ఎస్సైగా వాసు


ఎస్సై వాసు

మొగల్తూరు: మొగల్తూరు ఎస్సైగా జి.వాసు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల నోటీఫికేషన్ వెలువడిన తరువాత తూర్పు గోదావరి జిల్లా తాళ్ళపూడి ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న కె.వెంకటరమణను మొగల్తూరుకు బదిలీచేశారు. అయితే ఎన్నికల నోటిఫికేషన్ ఎత్తివేయడంతో వెంక టరమణను ఆచంటకు, కృష్ణాజిల్లా బంటు మిల్లి ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న జి.వాసును మొగల్తూరుకు బదిలీ చేయడంతో శనివారం ఎస్‌హెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించారు.

గంగాలమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో గంగాలమ్మ

నరసాపురం రూరల్: మండలంలోని ఎల్బీచర్లలో వేంచేసియున్న గంగాలమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా పేరొందిన ఈ అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చారు. భక్తులు మొక్కుబడిని చెల్లించుకొని అన్న సమారాధనలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.

నేటి నుంచి కేవీపీఎస్ శిక్షణా తరగతులు

భీమవరం: కేవీపీఎస్ రాష్ట్ర స్థాయి చైతన్య శిక్షణా తరగతులు సోమవారం నుంచి మూడు రోజులపాటు పట్టణంలో నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో దళితులు, వెనకబడిన తరగతుల అభివృద్ధికి కేవీపీఎస్ నిరంతరం పోరాడుతోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడుతుందన్నారు. శిక్షణ తరగతులు పట్టణంలోని అంబేడ్కర్ భవనంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ తరగతులకు ముఖ్య అతిథులుగా శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, కలెక్టర్ సి.నాగరాణి, ఎమ్మెల్సీలు ఐ.వెంకటేశ్వరరావు, కేఎస్ లక్ష్మణరావు, జిల్లా వైద్యాధికారి డి.మహేశ్వరరావు, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి కె.శోభారాణి, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి డి.పుష్పరాణి హాజరుకానున్నారని తెలిపారు.

కల సాకారమయ్యేనా..?

- కల్యాణ మండపంగా ఫిష్ మార్కెట్ భవనం
- గత ప్రభుత్వం నిర్ణయం.. ప్రభుత్వం మారడంతో ఆగిన ప్రతిపాదనలు


కళ్యాణమండపంగా అభివృద్ధి చేస్తామన్న మోడల్ ఫిష్ మార్కెట్ భవనం

నరసాపురం: పట్టణంలో పార్కు రోడ్డులో నిరుపయోగంగా ఉన్న మోడల్ ఫిష్ మార్కెట్ స్థానంలో మత్స్యకార కల్యాణ మండపం ఏర్పాటు చేయాలని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి బ్రేకులు పడ్డాయి. మత్స్యకారులకు ఎప్పటి నుంచో కలగా ఉన్న కల్యాణ మండపం అందుబాటులోకి వచ్చే అవకాశాలు కనిపించడం లేదు. నియోజకవర్గంలో పెద్దసంఖ్యలో ఉన్న మత్స్యకారులకు స్థానికంగా ఇప్పటి వరకూ ప్రత్యేకంగా ఓ కల్యాణ మడపం లేకపోవడం గమనార్హం. నరసాపురం నియోజకవర్గంలో 90 వేల వరకూ మత్స్యకార జనాభా ఉంది. నరసాపురం మున్సిపాలిటీలో కూడా పెద్దసంఖ్యలో మత్స్యకార జనాభా ఉంది. అయితే పట్టణంలో మత్స్యకారులకు ప్రత్యేకంగా ఓ కల్యాణ మండపం లేదు. పట్టణంలో మిగిలిన కొన్ని కులాలకు సంబంధించి ప్రత్యేక్య కల్యాణ మండపాలు ఉన్నాయి. మత్స్యకారులు తమకు కల్యాణ మండపం నిర్మించాలని, స్థలం ఇచ్చినా తాము పంక్షన్స్ చేసుకోవడానికి ఓ వేదిక ఏర్పాటు చేసుకుంటామని చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నారు.

–గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వలో ప్రయత్నం..

పార్కు రోడ్డులో 2007లో మోడల్ ఫిష్ మార్కెట్ భవనాన్ని రూ.17 లక్షలతో నిర్మించారు. అయితే వ్యాపారాలకు అనువుగా ఉండే ప్రాంతం కాదని ఆ భవనంలోకి మత్స్యకారులు రాలేదు. దీంతో మోడల్ ఫిష్ మార్కెట్ భవనం అప్పటి నుంచి ఖాళీగా, నిరుపయోగంగా ఉంది. దీంతో మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు ఆ భవనాన్ని మత్స్యకార కల్యాణ మండపంగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. అప్పటి మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజును తీసుకొచ్చి, కల్యాణ మండపంగా మార్చడానికి రూ.30 లక్షల నిధులు మంజూరు చేయించారు. ప్రభుత్వం మారిన తరువాత ఈ ప్రతిపాదన బుట్టదాఖలయ్యింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వ నిర్ణయాన్ని అమలు చేస్తుందా? లేదా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. కూటమి నేతలు కూడా ఇప్పటి వరకూ మత్స్యకారులకు ఎలాంటి హామీ ఇవ్వకపోవడంతో మత్స్యకార కల్యాణ మండపం కల సాకారం అయ్యేట్టుగా కనిపించడం లేదు.

మత్స్యకార కల్యాణ మండపం కట్టి తీరాలి



మోడల్ ఫిష్‌మార్కెట్ స్థలం మునిసిపాలిటీదే. మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అప్పటి మంత్రి సిదిరి అప్పలరాజును మార్కెట్ భవనం వద్దకు తీసుకొచ్చి, నిరుపయోగంగా ఉన్న భవనాన్ని ఆధునీకరించి మత్స్యకార కల్యాణ మండపంగా తీర్చిద్దాలని కోరారు. వెంటనే ఆయన అంగీకరించి నిధులు మంజూరు చేశారు. పనులు ప్రారంభమయ్యే దశలో ఎన్నికలు రావడంతో పెండింగ్ పడింది. నరసాపురంలో మత్స్యకార సోదరులు అధికసంఖ్యలో ఉన్నారు. ఖచ్చితంగా కల్యాణ మడపం కట్టాలి. ఇందుకు మున్సిపాలిటీ పాలకవర్గం కూడా పూర్తి అనుకూలంగా ఉంది.

– బర్రి శ్రీ వెంకట రమణ, మున్సిపల్ చైర్ పర్సన్

నేడు వన మల్లికార్జునుడికి జలాభిషేకం

మొగల్తూరు: మొగల్తూరులో వేంచేసియున్న శ్రీ భ్రమరాంబ సమేత వన మల్లిఖార్జునస్వామికి శ్రావణ మాసంలో వచ్చే 5 సోమవారాలు జలాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 4 సోమవారం నుంచి సెప్టెంబర్ 2వ తేదీ సోమవారంవరకు (5 సోమవారాలు) జలాభిషేకం నిర్వహిస్తామన్నారు. ఉత్తరాదిన జరుగుతున్న కావిడి యాత్రల మాదిరిగా మన ప్రాంతంలోని వన మల్లిఖార్జున స్వామికి కావడిలతో నీటిని తీసుకొచ్చి, జలాభిషేకం నిర్వహిస్తామన్నారు. శ్రీ శైలం తర్వాత స్వామివారి లింగాన్ని తాకి శాస్టాంగ నమస్కారంచేసే అవకాశంఉన్న ఆలయం. కావున భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకోవాలని కోరుతున్నామని నిర్వాహకులు తెలిపారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

నరసాపురం: సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమం నిర్వహిస్తోన్నట్టు నరసాపురం ఆర్డీవో ఎం.అచ్యుత్ అంబరీష్ చెప్పారు. డివిజన్‌లోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని వివరించారు. ప్రజలు తమ ఫిర్యాదులు, దరఖాస్తులు ఉదయం 10.30 గంటల నుంచి అందించాలని తెలిపారు.

300 మందికి ఉచిత వైద్య సేవలు


ఉచిత మెగా వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

యలమంచిలి: కుల, మతాలకు అతీతంగా పేదలందరికీ సహాయం చేయాలన్నదే యునైటెడ్ కాపు ఇంటర్నేషనల్ సర్వీస్ క్లబ్ (యూకేఎస్‌సీ) లక్ష్యాలలో ఒక అంశమని యూకేఎస్‌సీ ఇంటర్నేషనల్ డైరెక్టర్ డాక్టర్ ముచ్చర్ల సంజయ్ చెప్పారు. యూకేఎస్‌సీ ఆధ్వర్యంలో ఆదివారం దొడ్డిపట్ల హైస్కూల్లో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2020లో క్లబ్ స్థాపించిన నాటి నుంచి ఆర్థికంగా వెనుకబడిన పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్స్, అనారోగ్యానికి గురైన పేదలకు వైద్యానికి అవసరమైన ఆర్థిక సహాయం, పర్యావరణ రక్షణకు మొక్కలు నాటడం, కై లాసరథం, వివిధ గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో సిమెంట్ బల్లలు ఏర్పాటు వంటి పనులు చేపట్టామన్నారు. సేవల విస్తరణలో భాగంగా మారుమూల గ్రామాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు డాక్టర్ సంజయ్ చెప్పారు. ఈ శిబిరంలో కిడ్నీ, మూత్ర సంబంధిత వ్యాధులకు డాక్టర్ యాతం లక్ష్మీ శ్రీరంగ, చర్మ సంబంధిత వ్యాధులకు డాక్టర్ జక్కంపూడి సుభాషిణి, క్యాన్సర్ నిర్ధారణ వ్యాధులకు డాక్టర్ కుసుమ ప్రశాంతి, దంత సంబంధిత వ్యాధులకు డాక్టర్ కావలి మౌని జనరల్ వ్యాధులకు అమలాపురం కిమ్స్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ కౌశికి శిబిరంలో 300 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. శిబిర నిర్వహణకు క్లబ్ గవర్నర్ పెనుమాక రామ్మోహన్, అధ్యక్షుడు జక్కంపూడి మదన్‌మోహన్, కార్యదర్శి వేరుకొండ దుర్గా ప్రసాద్, కోశాధికారి శిరిగినీడి నాగార్జునరావు, తదితరులు సహకారం అందించారు.

ప్రత్యేక హోదా సాధించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీతారాం, బలరాంలు

పాలకొల్లు సెంట్రల్: ప్రత్యేక హోదా సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మంతెన సీతారాం అన్నారు. ఆదివారం పట్టణ మహిళా సంఘ భవనంలో జిల్లా సీపీఎం కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించాలన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేట్ పరం కాకుండా కాపాడుకోవలసిన భాధ్యత రాష్ట్రానిదేనన్నారు. జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులకు ధాన్యం సొమ్ములు ఇంకా రాలేదని వెంటనే రైతులకు సొమ్ములు చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులు ఖరీఫ్ పంటకు పెట్టుబడులు లేక ఎదురు చూస్తున్నారన్నారు. బకాయిలు వెంటనే చెల్లించి రైతులను ఆదుకోవాలన్నారు. సమావేశంలో సీపీఎం నేతలు కౌరు పెద్దిరాజు, పీవీ ప్రతాప్, కర్రి నాగేశ్వరరావు, కేతా గోపాలన్, జేఎన్‌వీ గోపాలం, తదితరులు పాల్గొన్నారు.

షేక్ బాజీ మృతికి కళాకారుల నివాళి


షేక్ బాజీకి నివాళులర్పిస్తున్న ఉభయ గోదావరి జిల్లాల కళాకారులు

పాలకొల్లు అర్బన్: రంగ స్థల, సినీ, బుల్లితెర నటుడు షేక్ బాజీ మృతికి పలువురు కళాకారులు నివాళులర్పించారు. పాలకొల్లు పట్టణం రామారావు పేటకు చెందిన షేక్ మీరా మొహిద్దీన్ (షేక్ బాజీ) ఇటీవల మృతి చెందారు. ఆయన సంతాప సభ పూలపల్లి ముస్లిం కమ్యూనిటీ భవనంలో ఆదివారం ఉభయ గోదావరి జిల్లాల కళాకారుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా షేక్ బాజీ చిత్రపటానికి పలువురు పూల మాలలు వేసి నివాళులర్పించారు. రిటైర్డు ప్రిన్సిపాల్ సీవీవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ షేక్ బాజీ సహజ నటుడని కొనియాడారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వంగా నరసింహారావు, ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ నాయకులు గుండా రామకృష్ణ, హరివిల్లు వ్యవస్థాపక అధ్యక్షుడు యర్రంశెట్టి వెంకటరత్నం, కోనసీమ వృత్తి కళాకారుల సంఘం అధ్యక్షుడు మంగం సత్యనారాయణ, ఎస్ఆర్ఎల్‌జీ కళాసమితి ఉపాధ్యక్షుడు తోలేటి నరసింహారావు, తదితరులు బాజీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

దాతల చేయూత అభినందనీయం


ఆస్పత్రిలో ఫ్యాన్‌లు అందిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

తణుకు అర్బన్: తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో రోగుల సౌకర్యార్థం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో దాత మల్లిన అరుణసారథి ఫ్యాన్‌లు అందజేయడం అభినందనీయమని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెలగల అరుణ అన్నారు. తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో రోటరీ క్లబ్ ద్వారా రొటేరియన్ మల్లిన అరుణ సారథి ఆర్థిక సౌజన్యంతో 15 సీలింగ్ ఫ్యాన్‌లు రోటర్ క్లబ్ అధ్యక్షుడు ఆనందరం మస్తాన్‌రావు అధ్యక్షతన డాక్టర్ అరుణకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోటరీ క్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాలు సద్వినియోగపడుతున్నాయని స్పష్టం చేశారు. అనంతరం అరుణసారథి సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ ట్రస్టు ద్వారా పేదలకు ఆసరాగా రూ.5 వేలు, రోటరీ క్లబ్ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో వేల్పూరు గ్రామానికి చెందిన విద్యార్థిని సీహెచ్ శృతి ప్రతిభను గుర్తించి రూ.8 వేలు ఆర్థిక సాయం అందజేశారు. సేఫ్‌కేర్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ సుంకవల్లి రామకృష్ణ, కె.సిద్ధార్థ, అక్కిన కాశీ విశ్వనాధం, కలగల వెంకటకృష్ణ, డాక్టర్ కె.సత్యనారాయణరాజు, డాక్టర్ వి.వెంకటరాజు, డాక్టర్ ఎస్‌వీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చేనేత వస్త్రాలకు ఆదరణ పెరగాలి


జాన నాగేశ్వరరావు కాంస్య విగ్రహావిష్కరణ చేసిన మంత్రి నిమ్మల

పాలకొల్లు సెంట్రల్: చేనేత కార్మికుడు జాన నాగేశ్వరరావు బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ఎంతో కృషి చేసిన గొప్ప వ్యక్తని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఆదివారం స్థానిక లాకు సెంటర్‌లో బహుజన కులాల ఆత్మ గౌరవ పోరాట యోధుడు, చేనేత కార్మికుడు జాన నాగేశ్వరరావు కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ చేతి వృత్తుల ప్రాధాన్యం పెరగాలని, వారికి తగిన చేయూత నివ్వాలని పేర్కొన్నారు. అలాగే చేనేత వస్త్రాలకు ఆదరణ పెరగాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం తరపున కొనుగోలు చేస్తామని, జీఎస్టీ తొలగించేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అంగర రామ్మోహన్, పెచ్చెట్టి బాబు, కర్నేన గౌరునాయుడు, వీవర్స్ సంఘ సభ్యులు వట్టం గణేశ్వరరావు, మానెం బసవరాజు, శాగా రాంబాబు, బాసిన సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వాయు త్రిలింగ క్షేత్రంలో పూజలు


పార్వతీ సమేత శ్రీ శివదేవస్వామిని దర్శించుకున్న నరసాపురం మున్సిపల్ కమిషనర్ దంపతులు

పాలకొల్లు అర్బన్: వాయు త్రిలింగ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన శివదేవుని చిక్కాలలోని శ్రీ పార్వతీ సమేత శ్రీ శివదేవస్వామి ఆలయంలో ఆదివారం శ్రావణ మాసం పురస్కరించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పార్వతీ దేవికి కుంకుమ పూజలు చేశారు. నరసాపురం మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు దంపతులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక అర్చనలు చేశారు. ఆలయ అర్చకస్వామి ర్యాలి శివాజీ, ఈవో నామాల రంగరాజన్ కమిషనర్ దంపతులను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

వైద్య సేవలు సద్వినియోగం చేసుకోండి

పెంటపాడు: అలంపురం వెంకటరమణ చారిటీ ద్వారా అందిస్తున్న ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు కొలనువాడ పెద కృష్ణంరాజు కోరారు. ప్రతీ రోజు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు జనరల్ వైద్య నిపుణులు డాక్టర్ ప్రియాంక, సునీల్ అందుబాటులో ఉండి, అన్ని రకాల వైద్య సేవలు అందిస్తారన్నారు. అవసర మైన వారికి, షుగర్, రక్త పరీక్షలు ఉచితంగా చేస్తున్నట్లు తెలిపారు. దీంతో పాటు డాక్టర్ కె.సాగర్ బాబు ద్వారా ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అంగవైకల్యం, పక్షవాతం, సయాటికా వ్యాధులకు వైద్య సేవలతో పాటు, ప్లేట్‌లెట్స్, టైఫాయిడ్, మలేరియా, కిడ్నీ, లివర్ పంక్షన్, కొలస్ట్రాల్, గుండెకు సంబంధించి ఈసీజీ పరీక్షలు ఉచితంగా చేస్తున్నట్లు పెద కృష్ణంరాజు తెలిపారు. ప్రతీ నెల గురువారాల్లో రాజమండ్రి జీఎస్ఎల్ ఆసుపత్రికి చెందిన ప్రత్యేక వైద్యులు అందుబాటులో ఉంటారన్నారు. కార్డియాలజీ, గైనకాలజీ, చర్మవ్యాధుల నిపుణులు, అంకాలజీ, జనరల్, చిన్న పిల్లల వ్యాధులకు సంబంధించి పరీక్షలు చేయనున్నట్లు ట్రస్టు ప్రతినిధి కృష్ణంరాజు తెలిపారు. పరిసర గ్రామాల ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ–పంట నమోదు వేగవంతం చేయండి


పెదఅమిరంలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

కాళ్ల: ఖరీఫ్ ఈ–పంట నమోదును త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. పెదఅమిరం పుంతరోడ్డులో ఈ–పంట నమోదు తీరును ఆదివారం ఆమె పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. రైతులు సాగు చేస్తున్న పంట వివరాలు నమోదుతోనే పంట సాయం, పంటల బీమా తదితర ప్రభుత్వ పథకాలు అందజేసేందుకు వీలవుతుందన్నారు. ఇందుకు ఈ–పంట నమోదు తప్పనిసరి అన్నారు. పంట నమోదులో అలసత్వం వహించవద్దని సిబ్బందిని హెచ్చరించారు. రెతులు ఏ పంటను సాగుచేస్తే ఆ పంట వివరాలనే నమోదు చేయాలన్నారు. మరో పంట సాగు చేసినట్లు నమోదు చేస్తే వారిపై చర్యలు తప్పవన్నారు. కౌలుదారు అనే విషయాన్ని స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పలువులు కౌలు రైతులతో మాట్లాడి వరి పంట సాగు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీ కేఎస్ఎస్ శ్రీనివాసరావు, తహసీల్దార్ ఈ.నాగార్జున, ఆర్ఐ లక్ష్మీకిరణ్, వ్యవసాయ, రెవెన్యూశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వెండి పళ్లెం బహూకరణ


మందాలమ్మకు వెండి పళ్లెం బహూకరిస్తున్న దాతలు

పెనుగొండ: వడలి గ్రామ దేవత మందాలమ్మకు విశాఖపట్నానికి చెందిన వంకాయల విక్రమ్, రోజా దంపతుల కుమారుడు నివాస్, కుమార్తె సుప్రజ కుటుంబ సభ్యులు వెండి పళ్లేన్ని బహూకరించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం ఆలయంలో జరిగిన కార్యక్రమంలో రూ.38 వేలు విలువ గల వెండి కంచాన్ని అందించారని తెలిపారు. ఆలయాభివృదికి సహకరిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా మావుళ్లమ్మ జాతర


మావుళ్లమ్మ అమ్మవారి జాతర మహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశం చౌక్): పట్టణంలోని 37వ వార్డులో శ్రీమావుళ్ళమ్మ అమ్మవారి జాతర మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలు, శక్తి వేషాలు, అఘోరాల నృత్యాలు, బుట్టబొమ్మలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మన పూర్వీకులు గ్రామ శాంతి కోసం పండుగలు, జాతరలు, ఉత్సవాలు ఏర్పాటు చేశారని, ఆధునిక యుగంలో ఈ ఆచారాన్ని కొనసాగించడం వల్ల ఎన్నో విపత్తుల నుంచి బయటపడుతున్నామని, ఈ సంస్కృతిని రాబోయే తరం వారికి తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మాజీ కౌన్సిలర్ చెన్ను శాంతి, చెన్ను చంటి, ఎ.కుమరన్ పాల్గొన్నారు.

‘వీవీ గిరి’ కళాశాల అభివృద్ధికి సమష్టిగా కృషి


కళాశాలలో పూర్వ విద్యార్థుల సమావేశంలో మాట్లాడుతున్న గొంట్లా కృష్ణ

ఆకివీడు: విద్యాదాత స్వర్గీయ చింతలపాటి మూర్తిరాజు ఆశయ సాధనలో వెలసిన వీవీగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దామని కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు గొంట్లా కృష్ణ పిలుపునిచ్చారు. దుంపగడపలోని కళాశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. దాతల సహకారంతో కళాశాల ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ప్రిన్సిపాల్ కె.సుజాత మాట్లాడుతూ ఈ నెల 29, 30 తేదీల్లో నాక్ బృందం కళాశాలను సందర్శించనుందన్నారు. ఈ నేపథ్యంలో పూర్వ విద్యార్థులతో నాక్ బృందం సమావేశం కానుందన్నారు. కళాశాలలో మౌలిక వసతులు, ఉత్తమ విద్యాబోధన, ల్యాబ్ తదితర సౌకర్యాలను గతం కంటే ఎంతో మెరుగుపడిన విషయాన్ని నాక్ బృందం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. నాక్ బృందం పరిశీలనలో కళాశాలకు ఏ++ గ్రేడ్ వచ్చేలా కృషి, సహకారం అవసరమన్నారు. పూర్వ విద్యార్థి సంఘ ప్రతినిధులు చొప్పెర్ల మూర్తి, పాల్గొన్నారు.

పసర్లు బారిన మంచినీటి చెరువు నీరు


గూట్లపాడులో రక్షిత మంచినీటి చెరువు

భీమవరం అర్బన్: గూట్లపాడులో రక్షిత మంచినీటి చెరువులో తాగునీరు పసర్లు బారడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ సిబ్బంది కుళాయి ద్వారా సరఫరా చేసే తాగునీరు మురికిగా, పసర్లుగా ఉండటంతో తరచూ జలుబు, జ్వరం తదితర వైరల్ జ్వరాలకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాల వల్ల కొత్తనీరు చెరువులో చేరడంతో తాగునీరు కలుషితమైందని వాపోతున్నారు. దీంతో ఆర్థిక స్థోమత కలిగినవారు మినరల్ వాటర్ కొనుక్కుని తాగుతున్నారని, స్తోమత లేని పలువురు ఇదే నీటిని వ్యాధులు బారిన పడుతున్నారని చెబుతున్నారు. ఇప్పటికైనా స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పితాని సూర్యనారాయణకు నివాళి

పెనుగొండ: ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు కళాశాల విద్యా సంస్థల పాలకవర్గ అధ్యక్షుడు పితాని సూర్యనారాయణకు ఆచంట నాయకులు ఘనంగా నివాళులు లర్పించారు. ఆదివారం కొమ్ము చిక్కాలలోని నివాసంలో పితాని సూర్యనారాయణ చిత్ర పటానికి పూలమాల వేసి, సోదరుడు ఎమ్మెల్యే పితాని సత్యనారాయణను, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. టీడీపీ నాయకులు గొడవర్తి శ్రీరాములు, బలుసు శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

దేవస్థానానికి అన్నదాన ట్రస్టు నిధుల అందజేత

భీమవరం (ప్రకాశం చౌక్): అన్నపూర్ణ పార్వతి సమేత శ్రీ సోమేశ్వర లక్ష్మీ జనార్ధన స్వామి వార్ల అన్నదాన చారిటబుల్ ట్రస్టులోని నిధులను ఆదివారం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు ఆధ్వర్యంలో పంచారామ క్షేత్రం సోమేశ్వర జనార్ధనస్వామి దేవస్థానానికి అందజేశారు. గతంలో ట్రస్ట్ ద్వారా ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించేవారు. ఈ క్రమంలో దాతలు ఇచ్చిన విరాళాల సొమ్ములు రూ.49,82,825.53లను సోమేశ్వర జనార్ధనస్వామి దేవస్థానానికి ట్రస్టు చైర్మన్ చైర్మన్ వేగేశ్న రంగరాజు అప్పగించినట్లు ఈవో డి.రామకృష్ణంరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు హాజరయ్యారు.

కార్మికులు సంఘటితంగా పోరాడాలి

తణుకు: ఏపీ సీడ్స్ కార్మికులు తమ సమస్యల పరిష్కారానికి సంఘటిత పోరాటాలకు సమాయత్తం కావాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు, ఏపీ సీడ్స్ హమాలీ వర్కర్స్ యూనియ న్ తణుకు శాఖ అధ్యక్షుడు కోనాల భీమారావు పిలుపునిచ్చారు. ఆదివారం తణుకు సురాజ్య భవన్‌లో ఏపీ సీడ్స్ హమాలీ వర్కర్స్ యూనియన్ తణుకు శాఖ సర్వసభ్య సమావేశం నిర్వహించారు.